# ప్రజా మాటల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




ఏఐ కాప్ రైటర్...
యాప్ ను ఆవిష్కరించిన సజ్జనార్


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 290 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 24 - 05 - 2026


# గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు

- తెలంగాణ కేబినెట్ ఆమోదం
- కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం భేటీ
- తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు కేబినెట్ పచ్చజెండా
- జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న అంశాలపై చర్చ



**హైదరాబాద్ :**
గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సంబంధిత పనుల కోసం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది.కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని కేబినెట్ నిర్ణయించింది. అసోం రైఫిల్స్, బీఎస్ఎఫ్, - మిగతా 2 లో

### తెలంగాణలో భానుడి ఉగ్రరూపం
## వడదెబ్బతో 34 మంది మృతి





- తెలంగాణలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాలులు
- వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 34 మంది మృతి
- కుమ్రం భీం జిల్లాలో రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 18 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ
- రానున్న నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రం భానుడి భగభగలతో అగ్నిగుండంలా మారుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిప్పుల వర్షం కురుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత, వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతూ, రాష్ట్రంలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు - మిగతా 2 లో

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఐసీఏఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్
- చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచన
- సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్ష

**హైదరాబాద్ :**
భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో - మిగతా 2 లో

## ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి



- మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు
- అమెరికా రావాలని ఆహ్వానం
- నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- భద్రత, వాణిజ్యం సహా కీలక రంగాలపై చర్చ
- యుద్ధం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం

**ఢిల్లీ :**
నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరపున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్-అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. - మిగతా 2 లో

## హైదరాబాద్‌లో టెస్లా షోరూం

- తెలంగాణ ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు
- హైదరాబాద్‌లో సేల్స్, సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయనున్న టెస్లా
- మంత్రి శ్రీధర్‌బాబుతో టెస్లా ఉన్నతాధికారుల ఉన్నత స్థాయి భేటీ
- తెలంగాణను గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న ప్రభుత్వం
- అనుబంధ పరిశ్రమలపైనా దృష్టి సారించాలని టెస్లాకు మంత్రి సూచన
- పెట్టుబడులకు పూర్తిస్థాయి సహకారం అందిస్తామని ప్రభుత్వ హామీ





2 లో

### గగనతలం మూసివేసిన ఇరాన్..
## మళ్లీ యుద్ధ భయం?



- ఇరాన్‌పై కొత్తగా సైనిక దాడులు చేసేందుకు అమెరికా యోచిస్తోందని కథనాలు
- అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గగనతలాన్ని పూర్తిగా మూసివేసిన ఇరాన్
- ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో తీవ్రమవుతున్న ఉద్రిక్తతలు
- ప్రభుత్వ బాధ్యతల కారణంగా సొంత కుమారుడి వివాహానికి దూరంగా ఉంటున్నట్టు తెలిపిన ట్రంప్

**ఢిల్లీ :**
అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌పై 'కొత్త దాడులు' చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది.సీబీఎస్ న్యూస్ కథనం ప్రకారం రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా కీలక పురోగతి లేకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు ఆమోదం తెలిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. అయితే, దాడులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా ఆ కథనం పేర్కొంది. - మిగతా 2 లో



2 లో

## దేశంలో 40 శాతం ఫేక్ న్యాయవాదులే!

- నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తింపు
- డిగ్రీల వెరిఫికేషన్‌కు లాయర్లు దూరంగా ఉన్నట్లు బీసీఐ వెల్లడి
- ఈ ఉదంతాన్ని సీజేఐ దృష్టికి తీసుకెళ్లిన బీసీఐ
- లాయర్ల డిగ్రీలపై సీబీఐ విచారణకు సీజేఐ యోచన

## నింద నుంచి తప్పించుకునేందుకే శాంతిదూత ముసుగు ధరించాడు



- బీజేపీ ఎంపీ సీఎం రమేష్
- పయ్యావుల కేశవ్ తో కలిసి సీఎం రమేష్ ప్రెస్ మీట్
- మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు
- శాంతిదూత ముసుగు వేసుకుని జగన్ కొత్త నాటకానికి తెరలేపారని వ్యాఖ్యలు
- జగన్ తాత రాజారెడ్డిపై అధికారికంగా రౌడీ షీట్ ఉందని వెల్లడి
- వివేకా హత్యపై ఓపెన్ పోల్ పెడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

**అమరావతి :**
వైసీపీ అధినేత జగన్ ఒక నటుడు, క్రిమినల్ అని, ఇప్పుడు హఠాత్తుగా శాంతిదూత ముసుగు వేసుకుని ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ఒక - మిగతా 2 లో


## ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఇంటినుంచే 74 రకాల వైద్య పరీక్షలు
- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదు
- సీబీఎన్ దగ్గర తోక తిప్పితే, ప్రజాహితం కోసం తోక కట్ చేస్తా
- 'సంజీవని' కార్యక్రమం వైఎస్సార్సీపీ తీరును తీవ్రంగా తప్పుబట్టిన సీఎం





**అమరావతి :**
ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 లోపే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని పథకం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమర్రి మండలం కంద్రిక గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వైఎస్సార్సీపీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదన్నారు. "సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రప్పారప్పా రంకెలు, జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే, ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటు లేదని సీఎం అన్నారు."అభివృద్ధి సంక్షేమంతోపాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల - మిగతా 2 లో



# సంపాదకీయం

## ‘తమిళ విజయం’ మనకు ఆదర్శం

ప్రజలు ఆలోచిస్తున్నారు కాబట్టి మార్పు మొదలవుతుంది. ఈ మాట తమిళనాడు రాజకీయాలలో నిజమైంది. అలాగే తెలుగు రాష్ట్రాల రాజకీయ పరిస్థితులకు అక్షరాలా సరిపోతుంది. ఎన్నికలయినదాదాపుగా ప్రతిసారి అధికార మార్పిడి జరుగుతున్నది, కానీ పాలన మారడం లేదు. పార్టీలు మారుతున్నాయి, కానీ రాజకీయ సంస్కృతి మారడం లేదు. టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్–– పేర్లు వేరయినా ప్రజల్లో పెరుగుతున్న భావన ఒక్కటే... అవినీతి, కుటుంబాధిపత్యం, కాంట్రాక్టర్ రాజకీయం, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగం.ఒకప్పుడు సిద్ధాంతాల కోసం నడిచిన రాజకీయాలు ఇప్పుడు ఎన్నికల మేనేజ్‌మెంట్‌కు పరిమితమయ్యాయి. ప్రజా సమస్యల కంటే మీడియా మేనేజ్‌మెంట్, సోషల్ ఇంజనీరింగ్, డబ్బు సమీకరణ, ఓటర్లకు పంపిణీ ప్రధాన అజెండాలుగా మారాయి. ఎన్నికలప్పుడు ప్రజలను గుర్తుచేసుకునే నాయకత్వం, తర్వాత కార్పొరేట్ వర్గాలకు దగ్గరవుతోందన్న అసంతృప్తి సామాన్యుల్లో ఉంది. బీజేపీ దక్షిణాదిలో స్థిరపడేందుకు ప్రయత్నిస్తోంది. కానీ ఉత్తర భారతంలో పనిచేసిన మత రాజకీయాలు ఇక్కడ పనిచేయడం లేదు. దక్షిణ భారత సమాజం సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, భాషాభిమానం, సెక్యులర్ విలువలపై నిర్మితమైంది. ఇక్కడ ప్రజలు మత విద్వేషాల కంటే ఉద్యోగాలు, విద్య, వ్యవసాయం, ధరలు, జీవనోపాధి గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. అయినా బీజేపీ ఒకవైపు ప్రాంతీయ పార్టీలతో రాజీ రాజకీయాలు చేస్తూనే, మరోవైపు మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి.ఈ పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికి విస్తృత అవకాశం ఏర్పడుతోంది. అదే బీసీ, దళిత, ఆదివాసీ, ముస్లిం, బహుజన రాజకీయాలు. సంఖ్యలో మెజారిటీ అయిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు రాజకీయ అధికారంలో మాత్రం ఎందుకు మైనారిటీగా మిగిలిపోతున్నారు అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. తమిళనాడులో విజయ్ రాజకీయ ప్రవేశం ఈ ప్రశ్నకు ఒక కొత్త దిశ చూపించింది. రాజకీయ వారసత్వం లేకుండా, సంప్రదాయ మీడియా మద్దతు లేకుండా, డబ్బు పంచకుండా, కేవలం యువత నమ్మకంతో, క్లీన్ ఇమేజ్‌తో, సోషల్ మీడియా శక్తితో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించగలిగాడు. ఆయన గెలిచింది కేవలం ఓట్లు కాదు... ప్రజల నమ్మకం, అభిమానంతో పాటు మార్పు కోసం ఎదురుచూస్తున్న యువత ఆత్మగౌరవాన్ని. ఇది తెలుగు రాష్ట్రాల బహుజన యువతకు ఒక గొప్ప సంకేతం. “మనం కూడా చేయగలం... మనం కూడా గెలవగలం” అనే నమ్మకం కలిగించే ఉదాహరణ.బహుజన ఉద్యమం కేవలం కుల సంఘాల స్థాయిలో ఆగిపోకూడదు. అది ఆత్మగౌరవ ఉద్యమంగా మారాలి. బీసీలతో మొదలైన చైతన్యం ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, యువత, మహిళలు, అట్టడుగు వర్గాలందరినీ కలుపుకుంటూ విస్తరించాలి. “ఓటు మాది... సీటు మీదా?” అనే ప్రశ్న ప్రతి గ్రామంలో వినిపించాలి. ప్రజల హృదయాలను గెలుచుకోకుండా రాజకీయాలు గెలవలేమని అనడానికి తమిళనాడు ఉదాహరణ. డబ్బుతో కొన్ని ఓట్లు కొనవచ్చు. కానీ నమ్మకాన్ని కొనలేరు. నిజంగా డబ్బే ఎన్నికలను నిర్ణయిస్తే డబ్బున్నవాళ్లే శాశ్వతంగా అధికారంలో ఉండాలి. కానీ ప్రజాస్వామ్యంలో మార్పు జరుగుతూనే ఉంది. అంటే ప్రజలు ఇంకా ఆలోచిస్తున్నారు... ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఉద్యమానికి కేవలం ఆగ్రహం సరిపోదు. సిద్ధాంతం కావాలి. సామాజిక న్యాయం, సమానత్వం, సెక్యులరిజం, ఆత్మగౌరవం–– ఇవే పునాదులు కావాలి. అంబేడ్కర్, ఫూలే, పెరియార్, కాన్షీరాం వంటి మహానుభావుల ఆలోచనలు ఉద్యమానికి దిశానిర్దేశం చేయాలి. తెలంగాణలో సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, సమ్మక్క–– సారలక్క, దొడ్డి కొమరయ్య వంటి పోరాట యోధుల వారసత్వం ఉద్యమానికి బలం కావాలి.ఇప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పూర్తిగా కార్పొరేట్ రాజకీయాల ప్రభావంలో ఉన్న కాలం. అందుకే సోషల్ మీడియానే కొత్త తరహా ఉద్యమాల ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి గ్రామంలో ప్రతి యువకుడు ఒక ప్రచారకర్త కావాలి. ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితేనే మార్పు సాధ్యమవుతుంది. ముఖ్యంగా, బహుజన రాజకీయాలు ద్వేష రాజకీయాలు కాకూడదు. ఆగ్రహం ఉండాలి కానీ, అసభ్యత కాదు. పోరాటం ఉండాలి కానీ, విద్వేషం కాదు. గౌరవంతో కూడిన రాజకీయ భాష ప్రజలను మరింత దగ్గర చేస్తుంది.తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. పాత రాజకీయాలపై విసుగు వచ్చింది. ఇదే సరైన సమయం. బహుజన శక్తులు గ్రామగ్రామాన తిరగాలి. ప్రతి స్థానంలో పోటీ చేయాలి. ప్రజల్లో నమ్మకం నింపాలి. అధికారాన్ని అడుక్కోవడం కాదు, సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలి. ఎందుకంటే బహుజన భావజాలం కేవలం ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కాదు, అది సామాజిక న్యాయ భారత నిర్మాణానికి మార్గం.

## గగనతలం మూసివేసిన ఇరాన్.. మళ్లీ యుద్ధ భయం?

**మొదటిపేజీ తరువాయి -** ఈ ఉద్రిక్తతల కారణంగా అమెరికా సైనిక, నిఘా వర్గాలకు చెందిన పలువురు అధికారులు తమ మెమోరియల్ డే వారాంతపు ప్రణాళికలను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో న్యూజెర్సీలో తన వారాంతపు పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్ హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వచ్చారు.ఈ సంక్షోభం తీవ్రతకు అద్దం పట్టేలా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి కూడా తాను హాజరుకాలేనని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. “ప్రభుత్వానికి సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా నేను వాషింగ్టన్‌లోనే ఉండటం ముఖ్యం” అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం నెలకొన్న గంభీరతను తెలియజేస్తోంది.గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగినప్పటికీ, ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై నెలకొన్న ప్రతిష్టంభనే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇరాన్‌ను అణ్వాయుధం కలిగి ఉండటానికి అనుమతించబోమని, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం విడిచి తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

## ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి

**మొదటిపేజీ తరువాయి -** మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికా–భారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా.. స్వేచ్ఛా, బహిరంగ ఇండో–పసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి. అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి” అని పోస్ట్ చేశారు.ప్రపంచ శాంతి భద్రతలపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి ట్రంప్ యోచిస్తున్నారనే వార్తల నడుమ ఈ భేటీ జరిగింది. చర్చల్లో భాగంగా ఇరాన్ సంక్షోభం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని మోదీ పేర్కొన్నారు.

## దేశంలో 40 శాతం ఫేక్ న్యాయవాదులే!

**మొదటిపేజీ తరువాయి -** దేశంలో నల్ల కోట్లు వేసుకుని కోర్టుల్లో తిరుగుతున్న న్యాయవాదుల్లో దాదాపు 35 నుంచి 40 శాతం మంది నకిలీవారేనని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా సంచలన నివేదిక ఇచ్చారు. వీరంతా నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి లేదా సృష్టించి కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.ఈ నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అడ్డుకోవడానికి బీసీఐ కసరత్తు ప్రారంభించింది. అడ్వొకేట్ల డిగ్రీ సర్టిఫికెట్లను పరిశీలించే ప్రక్రియను బీసీఐ మొదలుపెట్టగా.. దాదాపు 40 శాతం మంది తమ వెరిఫికేషన్ ఫారాలను పూరించలేదు. ఫారాలు నింపని వీరంతా నకిలీ న్యాయవాదులేనని బీసీఐ అనుమానిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ మిశ్రా వెల్లడించారు.సోషల్ మీడియాలో సంచలనంగా మారిన ‘కాక్రోచ్ జనతా పార్టీ’ ఉద్యమం వెనుక ఉన్న నేపథ్యాన్ని కూడా బీసీఐ మనన్ కుమార్ వివరించారు. గత వారం ఒక పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లాయర్ల డిగ్రీలపై అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్న యువతను ఉద్దేశించే ఆయన ‘కాక్రోచ్’ వ్యాఖ్యలు చేశారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్లు సీజేఐ చెప్పారని మిశ్రా స్పష్టం చేశారు.

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం

**మొదటిపేజీ తరువాయి -** ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు.సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. మున్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు

**మొదటిపేజీ తరువాయి -** సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్ స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.



# ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా సంజీవని




**మొదటిపేజీ తరువాయి -** మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు, తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు.తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి, పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది ఎన్డీయే కూటమి. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ తెలుగుజాతి ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా ఎదుగుతుంది” అని సీఎం చంద్రబాబు అన్నారు. “ప్రజల సంక్షేమ ంతోపాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. హోదా, కార్లు, డబ్బు ఎన్ని ఉన్నా, అన్నింటికి మించింది ఆరోగ్యం. సంజీవని పథకం కింద ఇంటినుంచే 74 రకాల వైద్య పరీక్షలు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ఒక ఏఐ డాక్టర్ ఉంటారు. ఏదైనా జబ్బు చేస్తే, ఏఐ డాక్టర్‌ను సంప్రదించి ఇంటి నుంచే చికిత్స. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే మా లక్ష్యం. ఎన్టీఆర్ ఆరోగ్య పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచితవైద్యం. ప్రజల గురించి తప్ప, నాకు మరో ఆలోచన లేదు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటాం, ప్రకృతిని కాపాడుకోవాలి. రాయలసీమలో ప్రతి జిల్లాకు సాగునీరు ఇచ్చాం. హంద్రీనీవా నీరును చిత్తూరు జిల్లా వరకు తీసుకెళ్లాం. శ్రీశైలం జలాశయం నీటిని వెంకన్న సన్నిధి వరకు తీసుకెళ్తాం. 32 ప్రాజెక్టులను ఏరోజు ప్రారంభిస్తామో ముందే తేదీలు చెప్పాం. ఈ ఏడాది ఎల్‌నినో వల్ల వర్షాలు తక్కువగా పడతాయంటున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని జాగ్రత్తగా వినియోగించుకోవాలి. పుట్టపర్తికి జెట్ విమానాలు తయారయ్యే పరిశ్రమలు తీసుకొచ్చాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. రాయలసీమలో త్వరలోనే బంగారుగని ప్రారంభం కానుంది. దేశంలోనే అత్యధిక బంగారం ఉత్పత్తి కర్నూలులో జరగనుంది”.

## హైదరాబాద్‌లో టెస్లా షోరూం




**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా.. హైదరాబాద్‌లో అడుగుపెట్టనుంది. నగరంలో తమ సేల్స్, సర్వీస్ సెంటర్‌ను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో టెస్లా ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.టెస్లా బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్, ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్.. మంత్రి శ్రీధర్‌బాబుతో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించేందుకు, వీలైనంత త్వరగా విక్రయాలు ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు వారు స్పష్టం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా నాలుగు షోరూమ్‌లను విజయవంతంగా ఏర్పాటు చేసిన టెస్లా, తమ తదుపరి ప్రతిష్ఠాత్మక కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. టెస్లా నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటికే విద్యుత్ వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీకి అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన బలమైన ఎకోసిస్టం ఉందని వివరించారు. సెమీకండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్స్, డీప్ టెక్నాలజీ వంటి రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. కేవలం కార్ల తయారీకే పరిమితం కాకుండా సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీ వంటి అనేక రంగాల్లో టెస్లా అగ్రగామిగా ఉందని మంత్రి కొనియాడారు.భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణహిత రవాణాను తమ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌ను క్లీన్ టెక్నాలజీ, గ్లోబల్ మొబిలిటీకి ప్రపంచస్థాయి హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం షోరూమ్‌లకే పరిమితం కాకుండా తెలంగాణలో టెస్లా అనుబంధ పరిశ్రమల ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు, పరిపాలనా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. దేశంలో ప్రస్తుతం కార్ల మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా కేవలం 4 శాతమేనని, ఈ రంగంలో వృద్ధికి అపార అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు శశాంక, నిఖిల్ చక్రవర్తి, రఘురామశర్మ, సాయికృష్ణ తదితరులు పాల్గొని టెస్లా విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. టెస్లా రాకతో తెలంగాణ ఆటోమొబైల్ రంగం అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## నింద నుంచి తప్పించుకునేందుకే శాంతిదూత ముసుగు ధరించాడు



**మొదటిపేజీ తరువాయి -** నేరస్తుడు అనే నింద జనాల్లోకి బలంగా వెళ్లిందని, ఇప్పుడా నింద నుంచి తప్పించుకునేందుకే జగన్ ప్రెస్ మీట్లు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి మంచి పనులు చేస్తే క్రిమినల్ ముద్ర పోతుంది కానీ, ప్రెస్ మీట్లలో పచ్చి అబద్ధాలు చెబితే పోదని హితవు పలికారు.ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ.. “కరడుగట్టిన నేరస్థులకు కూడా తట్టని కుట్రలు, కుతంత్రాలతో వైఎస్ కుటుంబం పులివెందులలో ఒక అరాచక సామ్రాజ్యాన్ని నిర్మించింది. జగన్ తాత రాజారెడ్డిపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పోలీస్ రికార్డుల్లో అధికారికంగా రౌడీ షీట్ నమోదైంది. ఒక కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించడం, ఒక మైనింగ్ యజమానిని దారుణంగా హత్య చేసి ఆ గనులను అక్రమంగా చేజిక్కించుకోవడం వంటి చర్యలతో రాజారెడ్డి డబ్బు కూడగట్టారు. పులివెందుల సమీపంలోని పార్నపల్లి గ్రామంలో ఆయన అరాచకాలకు నేటికీ సజీవ సాక్ష్యాలు ఉన్నాయి” అని ఆరోపించారు.తన రాజకీయ లబ్ధి కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిల మరణాలను జగన్ వేర్వేరుగా వాడుకుంటూ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సీఎం రమేష్ విమర్శించారు. “వివేకా హత్య కేసులో సీబీఐ లోతుగా దర్యాప్తు చేసి వైఎస్ భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసింది. ఈ హత్య వెనుక జగన్ హస్తం ఉందా లేదా అనే అంశంపై రాష్ట్రంలో ఓపెన్ పోల్ నిర్వహించాలి. ఒకవేళ ఆ పోల్‌లో జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని తేలితే నేను రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా” అని సవాల్ విసిరారు.ప్రజలకు జగన్ హత్యా రాజకీయాలపై పూర్తి అవగాహన వచ్చిందని, అందుకే ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడు తాను చాలా మంచివాడినని చెప్పుకుంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి మేధావులు కూడా పొంతన లేని వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో తమకున్న విశ్వసనీయతను పూర్తిగా కోల్పోతున్నారని సీఎం రమేష్ విమర్శించారు.

## జనసేన విప్ పదవికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా



**మొదటిపేజీ తరువాయి -** రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తన శాసన సభ విప్ పదవికి రాజీనామా చేశారు. శనివారం పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతోనే శ్రీధర్ ఈ నిర్ణయం తీసుకున్నారని జనసేన పార్టీ ఓ అధికారిక ప్రకటనలో వెల్లడించింది.ఇటీవల అరవ శ్రీధర్‌పై రైల్వే కోడూరుకు చెందిన ఓ మహిళా ఉద్యోగి తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఆయన కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ త్రిసభ్య కమిటీని కూడా నియమించారు. కమిటీ ముందు హాజరైన శ్రీధర్, ఈ వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు.అయితే, ఆరోపణలు చేసిన మహిళ ఇప్పటికీ సోషల్ మీడియా ద్వారా వీడియోలు విడుదల చేస్తూ తన వాదన వినిపిస్తున్నారు. ఈ వివాదం కొనసాగుతున్న తరుణంలోనే శ్రీధర్ రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తనపై వస్తున్న ఆరోపణలు, నెలకొన్న వివాదంపై పవన్ కల్యాణ్‌కు శ్రీధర్ వివరణ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ రాజీనామా ఆయన స్వయంగా చేశారా? లేక పార్టీ అధిష్ఠానం సూచన మేరకు జరిగిందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# తెలంగాణలో భానుడి ఉగ్రరూపం



**మొదటిపేజీ తరువాయి -** కోల్పోయారు. వాతావరణ శాఖ రాష్ట్రంలోని 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పగటిపూట బయటకు రావాలంటేనే ప్రజలు భయపడి ఇళ్లకే పరిమితమవు తున్నారు.నిన్న రాష్ట్రంలోనే అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లో 46.5 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, సూర్యాపేట సహా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46.4 డిగ్రీలుగా రికార్డయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46.2 నుంచి 46.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే 244 మండలాల్లో తీవ్రమైన ఎండల ప్రభావం కనిపించింది. సూర్యాపేట జిల్లాలోని 22 మండలాల్లో, మంచిర్యాల, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో 18 చొప్పున మండలాల్లో వడగాలులు వీచాయి.సాధారణంగా సూర్యాస్తమయం తర్వాత వాతావరణం చల్లబడుతుంది. కానీ, గాలిలో తేమ శాతం పూర్తిగా పడిపోవడంతో రాత్రిపూట కూడా వేడి సెగలు, ఉక్కపోత తగ్గడం లేదు. గురువారం రాత్రి హైదరాబాద్, హకీంపేట, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో సాధారణం కంటే 2.7 నుంచి 4.7 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు రాత్రుళ్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించాయి. ఈనెల 26 వరకు పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొన్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఏపీలో కాలుష్యరహితంగా గోదావరి పుష్కరాలు

**కుంభమేళా తరహాలో విస్తృత ఏర్పాట్లు**

**రాజమహేంద్రవరంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఖరారు**

**గోదావరి పుష్కరాల కోసం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పవన్ పరిశీలిస్తారన్న మంత్రి కందుల దుర్గేష్**

రాష్ట్రంలో గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించేలా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. అందులో భాగంగా వచ్చే ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వినూత్న ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ కుంభమేళాలో అనుసరించిన విధానాన్ని ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించారు.తాజాగా గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా నేడు(శనివారం) ఏర్పాట్లను మంత్రి పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన ఏర్పాట్లు పరిశీలించారు.గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష : గోదావరి పరీవాహక ప్రాంతంలో కాలుష్య నిర్మూలన, పుష్కరాల నిర్వహణకు అవసరమైన చర్యలపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రేపు(ఆదివారం) రాత్రి ఉపముఖ్యమంత్రి రాజమహేంద్రవరానికి చేరుకోనున్నారని, సోమవారం ఉదయం పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు బోటు ద్వారా వివిధ ఘాట్లను పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు.అలాగే నల్లా ఛానల్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా పరిశీలించనున్నారని చెప్పారు. అనంతరం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.“రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం నాడు గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యటిస్తారు. ఇక్కడ పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లు, అలాగే కాలుష్య రహితంగా నిర్వహించడం ఎలాగే అనే అంశాలను పరిశీలిస్తారు. రేపు రాత్రి పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరానికి చేరుకుంటారు. సోమవారం ఉదయం పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు బోటు ద్వారా వివిధ ఘాట్లను పరిశీలిస్తారు. అనంతరం



జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.10 కోట్ల మంది పుణ్యస్నానాలు : గోదావరి పుష్కరాలు వచ్చే సంవత్సరం జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరగనుండగా, వీటిలో కీలక రోజుల్లో (పీక్ డేస్) సగటున కోటి మంది చొప్పున పుష్కర స్నానాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలు మొదలయ్యే రోజు, చివరి రోజు, వారాంతాలైన శని, ఆదివారాలు, అమావాస్య రోజున సుమారు కోటి మంది చొప్పున భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు.ఆరు జిల్లాల పరిధిలో మొత్తంగా ఏర్పాటుచేసే ఘాట్లలో సుమారు 8 నుంచి 10 కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని అధికారులు లెక్కలు వేశారు. 2015వ సంవత్సరంలో జరిగిన పుష్కరాల్లో దాదాపు 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారు. అత్యధికంగా 2015వ సంవత్సరం జులై 18న 58.26 లక్షలు, 19వ తేదీన 56.23 లక్షల మంది భక్తులు వచ్చారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రత్యేక ఏర్పాట్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# కాలిన ఈత వనాన్ని పరిశీలించిన జీవన్ రెడ్డి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) మే 23 :** జగిత్యాల రూరల్ మండలం నర్సింగపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలిపోయిన ఈత వనాన్ని మాజీ మంత్రి బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ....అన్నిటికన్నా ప్రమాదమైన వృత్తి గీత కార్మిక వృత్తి అన్నారు. చెట్టు ఎక్కితే చెట్టు పైనుండి పడే ప్రమాదాలు ఎక్కువ అని తెలిపారు.నర్సింగాపూర్ గ్రామంలో ఈత తాటి వనం అగ్ని ప్రమాదం జరగడంతోని గీత కార్మికులు వారి వృత్తిని కోల్పోవడం బాధాకరం అన్నారు.వైన్ షాప్, బెల్ట్ షాప్ లతో ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తుందో కానీ వైద్యపరంగా గ్రామాలలో లక్ష కోట్లకు పైగా ప్రతి సంవత్సరం నిరుపేద కుటుంబాలపై భారం పడుతుందన్నారు.వైన్స్ షాప్ బెల్ షాప్ పై పెట్టే దృష్టి గీతా కార్మికులపై పెట్టండి ఉపాధిగా బాగుపడతారు ఆరోగ్యంగా ఉంటుందన్నారు.గీత కార్మికులకు ప్రోత్సాహం అనేది కేవలం కాగితాలలో కనబడుతున్నది తప్ప కార్య రూపంలో కనబడడం లేదన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దయచేసి కళ్ళు గీత కార్మికుల ఉపాధికి ప్రోత్సహింపచేసే విధంగా చేయాలనీ కోరారు.

# చిన్నాపూర్ లో రైతుల ధర్నా

## అధిక తూకం పై మండి పడ్డ రైతులు

## ఎర్రని ఎండను కూడా లెక్క చేయని అన్నదాతలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి – చుక్క గంగారెడ్డి – ( ప్రజా మంటలు) మే23 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామ రైతులు శనివారం జాతీయ రహదారి పై ధర్నా నిర్వహించారు. భగ – భగ మండుతున్న ఎర్రని ఎండను కూడా లెక్క చేయకుండా ఈ అన్నదాతలు జాతీయ రహదారిపై బైఠాయించి వారి నిరసనను వ్యక్తం చేశారు. వరిధాన్యము కొనుగోలు కేంద్రంలో సంచికి 3 కిలోల చొప్పున క్వింటాల్ కి 7.5 కిలోలు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హామాలీలు లేరు అనే సాకుతో వడ్ల ను తరలించడంలో అధికారులు జాప్యం చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్ల పేరుతో అధిక తూకం వేసి దోచు కుంటున్నారని ఆరోపించారు. చిన్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ రహదారిని దిగ్బంధం చేసి వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. సమాచారం అందుకున్న బుగ్గారం, ధర్మపురి పోలీసులు హుటా హుటిన తరలి వచ్చి రైతులను సముదాయించి ధర్నా నుండి విరమింప జేశారు.

# రైతులు పొలాల్లో వరి కోసిన అనంతరం వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దు

## ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి




**గొల్లపల్లి మే 23ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోని రైతులు వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిన వరి కొయ్యల ను కాల్చివేయవద్దని ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి, హెచ్చరించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు రహదారులపై పొగమంచు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే వ్యవసాయ భూముల్లోని సూక్ష్మ జీవులు నశించి భూమి సారవంతత తగ్గిపోతుందని పేర్కొన్నారు వరి కొయ్యలను కాల్చడం వలన సమీపంలోని డ్రిప్ పైపులు, విద్యుత్ మోటార్లు ఇతర వ్యవసాయ పరికరాలు అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా వరి అవశేషాలను కాల్చకుండా ఇతర ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.ఎవరైనా వరి కొయ్యలను కాల్చినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించబడతాయని ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి స్పష్టం చేశారు.

# కేంద్రీయ విద్యాలయ స్థలంలో రాద్ధాంతం అవసరం లేదు

## భోగ శ్రావణి కుటుంబ చరిత్ర ప్రజలకు తెలుసు

## ఖర్జూర చెట్లకు ఈత కాయలు కాస్తున్నాయి

## డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్య



**జగిత్యాల జిల్లా ప్రతినిధి – చుక్క గంగారెడ్డి – ( ప్రజా మంటలు) మే 23 :** కేంద్రీయ విద్యాలయం స్థలం విషయంలో అనవసర రాద్ధాంతం అవసరం లేదనీ, మన ఎమ్మెల్యేసంజయ్ కుమార్ పలు చోట్ల పరిశీలించి స్థలాలు విద్యార్థులకు అనుకూలంగా ఉన్న చోటనే కేటాయించారని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్యఅన్నారు.శనివారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగ శ్రావణి హయాంలో జగిత్యాల మున్సిపల్ పూర్తిగా అవినీతిమయం అయిందన్నారు..ఖర్జూర మొక్కలు నాటితే ఈత పండ్లు కాస్తున్నాయి మీరేనా మాట్లాడేది అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ లో బిజినెస్ చేసుకుంటూ మెరుపు తీగ లాగ జగిత్యాలకు వచ్చి ఏదో మాట్లాడితే ప్రజలు నమ్మరు ప్రజలు అన్ని గమనిస్తున్నారనీ పేర్కొన్నారు.ఎంపీ అరవింద్ పసుపు బోర్డు అని చెప్పి రైతులను మోసం చేశారు. స్పైస్ బోర్డు తో రైతులకు లాభం లేదన్నారు.జగిత్యాల అభివృద్ధికి ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నిరంతర కృషి ప్రధాన కారణం అని సూచించారు.భోగ శ్రావణి మాట అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. భోగ శ్రావణి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, కౌన్సిలర్ లు దయాళ చంద్రకళ శంకర్, స్వప్న గిరిధర్, పద్మ రాజేందర్, మమత రామకృష్ణారెడ్డి, నాయకులు ప్రవీణ్ రావు, పులి నర్సయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

## హాజరైన వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ



**భీమదేవరపల్లి మే 23 ప్రజా మంటలు :** భూసారాన్ని కాపాడుకుంటూ, పెట్టుబడులు తగ్గించి సుస్థిర ఆదాయం వైపు రైతాంగం అడుగులు వేయాలని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (రాజేంద్రనగర్), వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమ ముగింపు సభ శనివారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని రైతువేదికలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డా. కోట శివకృష్ణ మాట్లాడుతూ.. పంటల్లో యూరియాను అధికంగా వాడటం వల్ల సాగు ఖర్చు పెరగడమే కాకుండా తెగుళ్ల ఉధృతి ఎక్కువవుతుందని హెచ్చరించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పంట వ్యర్థాలను తగులబెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న రాయితీలు, ప్రభుత్వ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో అధికారులు అందించే సూచనలు పాటిస్తూ లాభసాటి వ్యవసాయం వైపు మళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల వెంకన్న, టీచింగ్ అసోసియేట్ డా. సౌజన్య, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శివాజీ, దేవేందు నాయర్, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

## రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త తగిన చర్యలు తీసుకోవాలి

## జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత



**గొల్లపల్లి మే 23 ప్రజా మంటలు :** ఎండపెల్లి మండలంలోని మారేడు పల్లి , ముంజంపల్లి గ్రామాల్లో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారుఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారుఅలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారుధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, డిప్యూటీ తాసిల్దార్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# కాక్‌రోచ్ హఠావో పార్టీ' పేరు, లోగోకు కాపీరైట్ రక్షణ

## ఫిర్యాదుతో దర్యాప్తు వేగవంతం

## కాక్రోచ్ జనతా పార్టీ పై చర్యలు..

## ప్రముఖ మానవ హక్కుల అడ్వకేట్ రామారావు ఇమ్మానేని






**సికింద్రాబాద్,మే 23 ( ప్రజామంటలు) :** తెలంగాణ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని తాను రూపొందించిన " కాక్రోచ్ హఠావో పార్టీ" పేరుతో పాటు బొద్దింక నిర్మూలనను ప్రతీకాత్మకంగా చూపించే ప్రత్యేక లోగోకు అధికారికంగా కాపీ రైట్ రక్షణ పొందారు. అయితే ఇదే సమయంలో సోషల్ మీడియాలో "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో సాగుతున్న వివాదాస్పద డిజిటల్ ప్రచారంపై అధికారులు రంగంలోకి దిగారు. రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుని, గౌరవ ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరిస్తూ నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించేలా సాగుతున్న ఈ అవమానకర ఆన్‌లైన్ కంటెంట్‌పై న్యాయవాది రామా రావు ఇమ్మానేని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు ఆధారంగా స్పందించిన కేంద్ర మంత్రిత్వ శాఖ, సదరు హ్యాండిల్ ద్వారా ద్వేషపూరిత ప్రచారం సాగిస్తున్న అభిజిత్ దీప్కేతో పాటు అతని సహచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది. ప్రజల్లో అపోహలు సృష్టించి, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఉన్న ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక, అభ్యంతరకర ఆన్‌లైన్ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఫిర్యాదుదారు కోరారు. న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా డిజిటల్ వేదికలపై సాగుతున్న ఈ దుష్ప్రచారంపై ప్రస్తుతం అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

# పొగాకు వ్యతిరేక కరపత్ర ఆవిష్కరణ



**జగిత్యాల మే 23 (ప్రజా మంటలు) :**జిల్లా కేంద్రం ఉమా శంకర్ గార్డెన్స్ లో పొగాకు వ్యతిరేక కరపత్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎం శ్రీనివాస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి ప్రముఖ పౌరాణిక వేద పండితులు బుర్ర భాస్కర శర్మ ఆవిష్కరించారు .ఈ సందర్భంగా బుర్ర భాస్కర్ శర్మ మాట్లాడుతూ పొగాకు అనేక అనర్థాలకు రోగాలకు కారణభూతం అవుతుందని ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గమనించాలని ఈ విషయంలో అవగాహన కల్పించడానికి ముందుకు వచ్చిన సామాజిక కార్యకర్తతవుటు రామచంద్రం ను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ పొగాకు అనబడే పదార్థానికి దూరంగా వుండాలని సూచించారు. ఈ నాటి కార్యక్రమంలో కరపత్ర రచయిత తవుటు రామచంద్రం, శ్రీదేవి, ఊటూరి అశోక్, రమ పురాణం వినడానికి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల కల్పనలో మోదీ సర్కారు రికార్డు

## కంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## రైల్ కళారంగ్ లో జాబ్ అపాయిమెంట్ లెటర్స్ అందజేత




**సికింద్రాబాద్,మే 23 ( ప్రజామంటలు):** సికింద్రాబాద్ బోయిగూడలోని 'రైల్ కళారంగ్' వేదికగా శనివారం 19వ "రోజ్‌గార్ మేళా" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో వర్చువల్‌గా జరిగిన ఈ మేళా ద్వారా మొత్తం 51 వేల మందికి ఉద్యోగ పత్రాలు లభించగా, సికింద్రాబాద్ వేదికగా 220 మంది యువతకు నియామక పత్రాలు అందాయి.ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 2022లో ప్రధాని మోదీ ప్రారంభించిన 'రోజ్‌గార్ మేళా' ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 12.5 లక్షల మందికి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయని స్పష్టం చేశారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాకపోయినప్పటికీ, ఏటా రూ. 12 లక్షల కోట్ల మూలధన వ్యయంతో ప్రైవేటు, ఇన్‌ఫ్రా రంగాల్లో కోట్ల సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు మోదీ సర్కారు బలమైన బాటలు వేసిందన్నారు. దేశంలో స్టార్టప్‌ల సంఖ్య 1.20 లక్షలకు పైగా పెరిగిందని, 'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన' ద్వారా 1.7 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చామని తెలిపారు. సాంకేతికత, సంస్కరణల వల్ల భారత్ ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, 2047 నాటికి వికసిత భారత లక్ష్యాన్ని చేరడంలో యువత పాత్ర అత్యంత కీలకమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ , రైల్వే అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు



**ఎల్కతుర్తి మే 23 ప్రజా మంటలు :**ఎల్కతుర్తి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు జిల్లా ఖనిజ అభివృద్ధి నిధి (డీఎంఎఫ్) ద్వారా రూ.30 లక్షలు మంజూరు చేయించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ కి కృతజ్ఞతగా ఎల్కతుర్తి అంబేద్కర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎల్కతుర్తి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు డీఎంఎఫ్ నిధుల ద్వారా రూ.30 లక్షలు మంజూరు చేయించడం ప్రజలకు ఎంతో మేలు చేసే నిర్ణయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదాలు తెలిపారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతోందని నాయకులు పేర్కొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ గారి నాయకత్వంలో ఎల్కతుర్తి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నినాదాలు చేశారు

# జిల్లా కలెక్టరేట్ లో కేసుల విచారణ

## భూములు కోల్పోతున్న రైతులకు ఆర్బిట్రేషన్ హియరింగ్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి – చుక్క గంగారెడ్డి – ( ప్రజా మంటలు) మే 23:** జగిత్యాల కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి–63 విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన ఆర్బిట్రేషన్ హియరింగ్ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా గుమ్లాపూర్, మోహన్ రావుపేట, మేడిపల్లిలి గ్రామాలకు చెందిన మొత్తం 323 మంది అవార్డీల కేసులను విచారణకు తీసుకున్నారు. భూముల స్వాధీనంపై రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, పరిహారం అంశాలు, ఇతర సమస్యలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు.పలువురు పిటిషనర్ల తరపున న్యాయవాదులు హాజరై రైతుల అభిప్రాయాలను, సమస్యలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే 63వ నేషనల్ హైవే ప్రాజెక్టుకు సంబంధించి మంచిర్యాల పీడీ తరపున అడ్వకేట్ హాజరై సంబంధిత వివరాలను వెల్లడించారు.ఈ హియరింగ్‌లో కోరుట్ల ఆర్డీవో ఎల్. జీవాకర్ రెడ్డి పాల్గొని భూ స్వాధీన ప్రక్రియ, పరిహారం చెల్లింపుల అంశాలపై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కోరుట్ల ఎల్. జీవాకర్ రెడ్డి, కలెక్టరేట్ జి సెక్షన్ సూపరెండెంట్ ఉదయ్ కుమార్, మరియు తదితరులు పాల్గొన్నారు.రి

# రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్ దే

## అన్న దాతలను అరిగోశపెట్టిన నాయకుడు రేవంత్ రెడ్డి

## మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి – చుక్క గంగారెడ్డి – ( ప్రజా మంటలు) మే 23:** రైతును రాజు ను చేసిన ఘనత కేసీఆర్ దేనని జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత – సురేష్ అన్నారు. ఈ నాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నదాతలను అరిగోస పెడుతున్నాడని ఆమె ఆరోపించారు. శనివారం రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను బిఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లనే కల్లల్లో ఎక్కడి ధాన్యం అక్కడె పేరుకుపోయిందని అన్నారు. గ్రామంలోని రైతులు కొనుగోలు చేయాలని ధర్నా చేసిన కూడా ఇక్కడున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని దీన్నిబట్టి ప్రభుత్వానికి రైతులపై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు.రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడ్డట్టు లేదు అనే సమేత లాగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పంట పండించడం ఒక ఎత్తు అయితే దాన్ని అమ్ముకోవడం ఇంకో ఎత్తు అవుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్రానికి వెన్నెముకైనటువంటి రైతును రాజు చేసిన ఘనత కెసిఆర్ గారిది అని, తెలంగాణ ఒక దేశానికి అన్నపూర్ణగా ఉన్నది అని అంటే అది కేసీఆర్ గారి వల్లే అని అన్నారు.నెత్తి మీద ఎండ మరోవైపు కళ్లలో వడ్లు ఉన్నాయని రైతు పరిస్థితి అన్నమో రామచంద్ర లాగా ఉందని వర్షాలు తొందరగా వచ్చే అవకాశం ఉన్నందున రైతులు భయం గుప్పెట్లో పెట్టుకుని ఉంటున్నారని అన్నారు. రైతును రాజు చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి రైతులను మోసం చేశారని, పంట చేతికొచ్చి అమ్ముకునే సమయమైన కూడా రైతుబంధు ఇంకా పూర్తిగా వేయలేదని రైతుబంధు సంగతేమో గాని చేతికొచ్చిన పంట కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారని అన్నారుమేము వడ్లు కొంటున్నాం ప్రణాళికతో ఉన్నామని పేపర్ ప్రకటనలే తప్ప క్షేత్రస్థాయిలో పని జరగడం లేదని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఒక ప్రణాళిక బద్ధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసిన నాయకుడు కేసీఆర్ అయితే రైతులను అరిగోస పెడుతున్న నాయకుడు రేవంత్ రెడ్డి అని అన్నారు.ప్రజా పాలన ప్రగతి పాలన అని దేనికి జరుపుకుంటున్నారు. కళ్ళలలో ఉన్న వడ్లు కొనుగోలు చేయనందుకు ప్రజా పాలన సంబరాలు జరుపుకుంటున్నార...?సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా దాన్యం కొనుగోలు చేపట్టాలని అన్నారు.ప్రజా పాలన పేరిట దరఖాస్తులతో ప్రజలను మభ్యపెడుతూ ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర మేల్కొని ఎక్కడ వడ్లు ఉన్నాయో త్వరగా కొనుగోలు పూర్తి చేయాలని అన్నారు..ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్. నాయకులు బర్కాం మల్లేష్ ఆనంద్ రావు సుధాకర్ పాక్స్ చైర్మన్ రాజి రెడ్డి, సర్పంచ్ లు స్వామి రెడ్డి, గంగాధర్ నాయకులు చాంద్, మల్లారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ఆడెపు క్రిష్ణ, నందు నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భర్త అత్తమామల వేధింపులు

## బావిలో దూకి మహిళ ఆత్మహత్య

## కేసు నమోదు చేసిన పోలీసులు



**ధర్మపురి / జగిత్యాల జిల్లా ప్రతినిధి – చుక్క గంగారెడ్డి ( ప్రజా మంటలు) మే 23:**

ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముత్తుర్ల పుష్పలత (38) ఆమెకి 20 సంవత్సరాల క్రితం వారి బంధువైన ముత్తుట్ల రాజేష్ తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లల సంతానం. అయితే 12 సంవత్సరాల నుండి వారి మధ్య గొడవ జరిగి పుష్పలత ప్రస్తుతం తన తల్లిదండ్రి వద్దనే ఉంటున్నది. పుష్పలత మానసిక స్థితి బాగోలేదని రాజేష్ డైవర్స్ కేసు పెట్టగా అప్పటి నుండి పుష్పలత మానసికంగా బాధ పడుతూ ఉండేది.అదే బాధలో తీవ్ర మనస్థాపానికి గురై తేదీ 22.05.2026 రోజున తిమ్మాపూర్ లోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రామయ్య ధర్మపురి పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై.జి మహేష్ తెలిపినారు

# సికింద్రాబాద్‌లో హత్య కేసు ఛేదన

## నిందితుడి అరెస్ట్




**సికింద్రాబాద్,మే 23 ,( ప్రజామంటలు):** సికింద్రాబాద్ మార్కెట్ పోలీసు స్టేషన్ పోలీసులు హత్య కేసును ఛేదించి పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేశారు. బోరబండకు చెందిన ఎలిగోటి పెద్ద నర్సింహులు (33)ను సహచరుడు బోటెకు ఉత్తమ్ ఘర్షణలో పదునైన వస్తువుతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం పరారైన నిందితుడిని ప్రత్యేక బృందాలు పట్టుకున్నాయి. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్ నేతృత్వంలో పోలీసులు ఈ కేసును చేదించినట్లు మార్కెట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రామచంద్రం తెలిపారు.

# "తల్లికి వందనం" కావాలా ఈ పని చేయాల్సిందే

**లేదంటే డబ్బులు రావు!**

**ఈ ఏడాది తల్లికి వందనం నిధుల జమకు కసరత్తు**

**ముందుగా మేల్కొంటేనే పథకం వర్తింపు**



రాష్ట్రంలో విద్యా రంగంలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రంగం పటిష్ఠతకు పలు అంశాలను అమల్లోకి తీసుకొచ్చింది. పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో ఇంటింటా ఆనందం విరిసేలా కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని ప్రవేశపెట్టింది. కుటుంబంలో ఉన్న పిల్లలందరినీ అర్హులుగా నిర్ధారించింది. ఇందులో భాగంగా బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15,000ల చొప్పున నగదు జమచేస్తోంది. ఇందులో రూ.2,000లు పాఠశాల నిర్వహణ, రూ.13,000లు ఆ విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్న విషయం తెలిసిందే.మరికొద్ది రోజుల్లో (జూన్‌లో) విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ఈ క్రమంలోనే తల్లికి వందనం నిధులు జమ చేసేందుకు సర్కార్ కసరత్తు చేస్తోంది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరి. గత సంవత్సరం ఆధార్ అనుసంధానం కాకపోవడంతో పలు జిల్లాలో చాలా మంది తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. వీరంతా బ్యాంకులు, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. లబ్ధిదారులు గతంలో పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందస్తుగా బ్యాంకు అకౌంట్‌తో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని విద్యాశాఖ విజ్ఞప్తి చేస్తోంది.

నంద్యాల జిల్లాలో గత సంవత్సరం అన్ని విద్యా సంస్థల పరిధిలో కలిపి 2,59,561 మందిని అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రూ.308.90 కోట్లను సర్కార్ విడుదల చేసింది. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో 17,437 మంది లబ్ధి పొందలేకపోయారు.

కర్నూలు జిల్లాలో 4,19,295 మందిని అర్హులుగా గుర్తించారు. ఇందుకోసం రూ.531.94 కోట్లు మంజూరు చేశారు. అయితే బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో 32,408 మంది విద్యార్థుల తల్లి ఖాతాలో నిధులు జమ కాలేదు.

కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో 1343 ప్రభుత్వ, 435 ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో 2,36,384 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1,89,195 మంది ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. కానీ 1,75,782 మంది విద్యార్థులకు సంబంధించి 1,25,965 తల్లుల ఖాతాల్లో రూ.224.29 కోట్లు జమయ్యాయి. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో మొత్తంగా 13,413 మందికి రూ.20.12 కోట్ల నిధులు అందుకోలేకపోయారు.

ఎన్టీఆర్ జిల్లాలోని 20 మండలాల్లో 913 ప్రభుత్వ, 1429 ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో 3,33,937 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 2,60,004 మంది ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. కానీ కేవలం 2,36,984 మంది విద్యార్థులకు సంబంధించి 1,74,669 తల్లుల ఖాతాల్లో రూ.302.43 కోట్ల నిధులు జమయ్యాయి. తల్లుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, ఇతరత్రా కారణాల వల్ల 23,020 మంది పిల్లలు రూ.34.53 కోట్లు పొందలేకపోయారు.

బాపట్ల జిల్లాలో ఆధార్ అనుసంధానం కాక గతేడాది సుమారు 9 వేల మందికి నిధులు జమ కాలేదు.

**ఆధార్, బ్యాంక్ ఖాతా లింక్‌ను ఇలా సరిచూసుకోండి :**

ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారులు సంబంధిత బ్యాంకుకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. వెళ్లేముందు ఆధార్ కార్డు తీసుకుని వెళ్తే మంచిది.

బ్యాంకులో ఎన్‌పీసీఐ లింక్‌డ్ ఫారం లేదా ఆధార్ సీడింగ్ ఫారం తీసుకోవాలి. ఆధార్ సంఖ్య, బ్యాంకు అకౌంట్ వివరాలు, మొబైల్ నంబర్‌తో పాటు అవసరమైన సమాచారం నమోదు చేయాలి. దాన్ని బ్యాంకు సిబ్బందికి అందజేసి రసీదు పొందాలి. ఎన్‌పీసీఐ అనుసంధానమయ్యాక ఫోన్ నంబర్‌కి సంక్షిప్త సందేశం వస్తుంది.మీ అకౌంట్ ఆధార్‌కు లింకు కాకుంటే ఆధార్ జిరాక్స్‌పై సంతకం చేసి సమర్పించాలి. ఎస్ఎంఎస్ ద్వారా నిర్ధారణ సందేశం వస్తోంది. ఆన్‌లైన్‌లో 'యూఐడీఏఐ' అధికారిక ఆధార్ వెబ్‌సైట్లోకి వెళ్లి "మై ఆధార్ నుంచి ఆధార్ సర్వీసెస్" ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. ఆధార్ లింక్ సర్వీసెస్ ఆప్షన్ తీసుకొంటే లాగిన్ వస్తుంది. అక్కడ 12 అంకెల ఆధార్ నంబర్, క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేయాలి. వెంటనే రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని సబ్మిట్ చేయాలి. ఇలాచేస్తే ఆధార్‌కు ఏ బ్యాంకు లింక్ ఉందన్న సమాచారం కనిపిస్తుంది. లింక్ లేకుంటే సంబంధిత బ్యాంకులో సంప్రదిస్తే అనుసంధానం చేస్తారు.

# హైదరాబాద్‌లో ఇద్దరు రౌడీషీటర్ సోదరులపై పీడీ యాక్ట్

**హత్యలు, వసూళ్లకు పాల్పడుతున్నారని పోలీసుల ఆరోపణ**

**బెయిల్‌పై విడుదలై మళ్లీ నేరాలు చేస్తున్నారని వెల్లడి**

**నిందితులను అరెస్ట్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు**



హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇద్దరు రౌడీషీటర్ సోదరులపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ నమోదు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఒమర్ బిన్ హంజా అల్ జాబ్రి, అలీ బిన్ హంజా అల్ జాబ్రి అనే అన్నదమ్ములపై ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.గత కొంతకాలంగా ఈ సోదరులు హత్యలు, హత్యాయత్నాలు, బలవంతపు వసూళ్లు, బెదిరింపులు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని సీపీ పేర్కొన్నారు. ఆయుధాలతో అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒమర్ బిన్ హంజాపై 8 క్రిమినల్ కేసులు, అలీ బిన్ హంజాపై 7 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని వివరించారు. గతంలో పలు కేసుల్లో అరెస్టయిన వీరు, బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా నేర కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని రెయిన్‌బజార్ పోలీసులు నివేదిక సమర్పించారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సజ్జనార్ తెలిపారు. సీపీ ఆదేశాలతో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# పుణ్యక్షేత్రం నుంచి తిరుగు ప్రయాణంలో ప్రమాదం.. దంపతుల మృతి

**అనకాపల్లి జిల్లా కసింకోట మండలం తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై ఘటన**

**ఆగి ఉన్న లారీని ఢీకొన్న మహీంద్ర వాహనం**

**ఘటనాస్థలంలోనే ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు**

**భద్రాచలం నుంచి తిరిగి వస్తుండగా జరిగిన దుర్ఘటన**



అనకాపల్లి జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కసింకోట మండలం తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఓ మహీంద్ర వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగపాక మండలానికి చెందిన ఒకే కుటుంబం భద్రాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లింది. దైవ దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాళ్లపాలెం సమీపంలోకి రాగానే మహీంద్ర వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయింది.సమాచారం అందుకున్న కసింకోట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను ఆడారి కూర్మారావు (42), జ్యోతి (31)గా గుర్తించారు. గాయపడిన ఆరుగురిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విశ్రాంత ఐపీఎస్ భార్య హత్య కేసు

**ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**ప్రధాన సూత్రదారి కల్పన ప్రియుడు వికాస్‌గా గుర్తింపు**

**మిగిలిన నిందితుల కోసం ముమ్మర గాలింపు**



జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో మాజీ ఐపీఎస్ అధికారి భార్య తనూజ రంజన్ హత్య, బంగారు ఆభరణాల దోపిడీ కేసులో ఇద్దరిని జూబ్లీహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే కుటుంబం నివసిస్తోంది. ఈ ఇంట్లో నేపాల్‌కు చెందిన కల్పన కొంతకాలంగా పనిచేస్తోంది.కల్పనకు నేపాల్‌కు చెందిన వికాస్ అనే ప్రియుడున్నాడు. అతను కొన్ని రోజుల క్రితం కల్పన పని చేసే ఇంట్లో దొంగతనం చేయాలని ప్లాన్ చేశాడు. ఇందుకోసం సునీల్ పెర్యార్, సృజనశాయి, నేత్రశాయి, దినేశ్‌శాయి, గణేశ్‌శాయి, శంకర్‌లామా, కాంచనలను ఒక గ్యాంగ్‌లా తయారు చేశాడు. వినయ్‌రంజన్ ఇంట్లో లేని విషయాన్ని కల్పన ఆమె ప్రియుడు వికాస్‌కు తెలియజేసింది. ఈ నెల 7న సృజన్‌శాయి, నేత్రశాయిలను రెక్కీ కోసం వికాస్ పంపాడు. ఆ ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చోరీకి అనుకూలంగా ఉందని చెప్పారు.మే 8వ తేదీన రాత్రి ఒంటి గంట సమయంలో బంగారు ఆభరణాల కోసం పక్కా ప్రణాళికతో ఇంట్లోకి ముగ్గురు చొరబడ్డారు. మిగిలిన నలుగురు ఇంటి బయట కాపలాగా ఉన్నారు. ఇంట్లోకి వెళ్లిన ఈ ముగ్గురు తనూజ రంజన్ నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు కట్టేసి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. ఆ తర్వాత మృతురాలి మెడలోని మంగళసూత్రం, రింగులతో పాటు బీరువాలో భద్రపర్చిన నగలు కలిపి మొత్తం 23 తులాల బంగారంతో పరారయ్యారు. ఈ ఘటన అనంతరం నిందితులు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఉదయం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కి కాజీపేటలో దిగారు.ఆ దోచుకున్న సొత్తును వాటాలుగా పంచుకున్నారు. నాలుగైదు రైళ్లలోకి ఎక్కి కిందకు దిగారు. అప్పటి వరకు కలిసే ఉన్న ముఠా తర్వాత వేర్వేరుగా విడిపోయి పారిపోయారు. ఫేస్‌బుక్ మెస్సెంజర్ ద్వారా మంతనాలు సాగించుకుంటూ యూపీ-నేపాల్ సరిహద్దు ద్వారా పారిపోయేందుకు ప్లాన్ చేసుకున్నారు. కాజీపేట నుంచి దోపిడీ చేసిన ఆభరణాలను ముంబయికి తీసుకెళ్లి, అక్కడి సునీల్‌పెర్యార్ తన ఆభరణాలను దిలీప్ బిశ్వకర్మకు విక్రయించాడు. దీంతో వీరిద్దర్ని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.ఈ కేసులో ప్రధాన నిందితురాలు కల్పన ఆమె ప్రియుడు వికాస్ పథకం ప్రకారమే దోపిడీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దోపిడీ అనంతరం పరారైన కల్పన ఇది వరకే నేపాల్ చేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఠాను పట్టుకునేందురు 12 పోలీసు బృందాలు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా ప్రస్తుతం ఇద్దరు పట్టుబడ్డారు. మిగతా వారి కోసం వెతుకుతున్నారు. దోపిడీలో పాల్గొన్న నిందితుల్లో ఒకరైన సునీల్‌ను ముంబయిలో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించినట్టు తెలిసింది.నేపాల్ నుంచి ఉపాధి కోసం కల్పన పుణెకు వచ్చింది. అక్కడ కొంతకాలం ఇళ్లల్లో పని చేసింది. అక్కడ పరిచయమైన వికాస్‌తో సన్నిహితంగా మెలిగింది. సరిగ్గా 8 నెలల క్రితం వినయ్ రంజన్ రే ఇంట్లో పని చేస్తున్న నేపాలీ మహిళ బంధువుల ఇంటికి వెళ్తూ కల్పనను ఇక్కడ పనిలోకి కుదుర్చింది. అప్పటి నుంచి ఇంటి పని చేస్తూ నమ్మకంగానే నటించింది. ఈ మధ్య కాలంలో వికాస్ ఫోన్ కాల్‌తో ఒక్కసారిగా పరిస్థితులు తారుమారయ్యాయి. ఎప్పటికప్పుడు ఆమె పనిచేస్తున్న ఇంటి వాతావరణం, కుటుంబసభ్యుల గురించి వివరాలు తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో దొంగతనం చేసేందుకు అనువైన పరిస్థితి గురించి ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆమెకు దిశానిర్దేశం చేస్తూ వచ్చాడు. చివరకు తన ప్లాన్ ప్రకారం దోపిడీకి పాల్పడ్డాడు.

# కూలిన ఆర్మీ హెలికాప్టర్.. ప్రాణాలతో బయటపడి సెల్ఫీ తీసుకున్న అధికారులు!

**లేహ్‌లో కూలిన ఆర్మీ హెలికాప్టర్ , ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు అధికారులు**

**శిథిలాల ముందు నిలబడి సెల్ఫీ , సోషల్ మీడియాలో ఫొటో వైరల్**

**ప్రమాదంపై విచారణకు ఆదేశం**



లడఖ్ లోని లేహ్ ప్రాంతంలో శనివారం భారత ఆర్మీకి చెందిన ఒక చీతా హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక లోపం కారణంగా అది కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఆర్మీ అధికారులు ముగ్గురు త్రుటిలో ప్రాణాలతో బయటపడడం విశేషం. హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసమైనప్పటికీ అధికారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ తర్వాత కూలిపోయిన హెలికాప్టర్ శిథిలాల ముందు నిలబడి అధికారులు చిరునవ్వుతో సెల్ఫీ క్లిక్‌మనిపించారు. మృత్యువు ముఖం నుంచి త్రుటిలో తప్పించుకున్నాక కూడా వారిలో ఉన్న స్థైర్యం, ఆత్మవిశ్వాసం ఈ ఫొటోలో స్పష్టంగా కనిపించాయి. ప్రస్తుతం ఈ సెల్ఫీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి రెస్క్యూ బృందాలు చేరుకున్నాయి. అధికారులను సురక్షిత ప్రాంతానికి తరలించాయి. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దేశం కోసం పనిచేసే ఈ సైనికుల నైతిక స్థైర్యాన్ని చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# ఉగ్రవాది అంత్యక్రియలకు టాప్ టెర్రరిస్టులు

**పాక్ అబద్ధాలు బట్టబయలు**

**పాక్‌లో హతమైన అల్-బద్ర్ ఉగ్రవాది హంజా బుర్హాన్ అంత్యక్రియలు**

**ఇస్లామాబాద్‌లో జరిగిన అంత్యక్రియలకు హాజరైన టాప్ టెర్రరిస్టులు**

**హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్, అల్-బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ హాజరు**

**ఏకే-47లతో ఉగ్రనేతలకు భారీ భద్రత కల్పించిన ఉగ్రవాదులు**

**ఉగ్రవాదానికి అడ్డా తమ దేశం కాదన్న పాక్ వాదనలు మరోసారి అబద్ధమని తేలిన వైనం**



ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని పాకిస్థాన్ చెప్పే మాటలు మరోసారి నీటిమూటలయ్యాయి. ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులకు పాకిస్థాన్ సురక్షితమైన అడ్డాగా మారిందన్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఇస్లామాబాద్‌లోనే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల హతమైన ఓ ఉగ్రవాది అంత్యక్రియలకు అనేక మంది టాప్ టెర్రరిస్టులు బహిరంగంగా హాజరై, పాకిస్థాన్ అసలు స్వరూపాన్ని ప్రపంచానికి చూపించారు.వివరాల్లోకి వెళితే, నిషేధిత అల్-బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్, 'డాక్టర్' అనే కోడ్‌నేమ్‌తో పనిచేసిన అర్జుమంద్ గుల్జార్ దార్ అలియాస్ హంజా బుర్హాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించాడు. శుక్రవారం అతని మృతదేహానికి ఇస్లామాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాచే ఉగ్రవాదిగా ప్రకటించబడిన హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్-బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ వంటి కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా బఖ్త్ జమీన్ ఖాన్ చుట్టూ ఏకే-47 వంటి ఆధునిక ఆయుధాలతో ఉగ్రవాదులు కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. ఇటీవల కాలంలో పాకిస్థాన్‌లో వరుసగా ఉగ్రవాదులు గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమవుతున్న నేపథ్యంలో, తమ నేతల భద్రతపై ఉగ్రవాద సంస్థలు ఆందోళన చెందుతున్నాయని ఈ ఘటన తెలియజేస్తోంది. ఈ హత్యల పరంపర ఉగ్రవాదుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నట్లు సమాచారం. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా రత్నిపొరకు చెందిన బుర్హాన్, చట్టబద్ధమైన పత్రాలతో పాకిస్థాన్‌కు ప్రయాణించి అల్-బద్ర్ సంస్థలో చేరాడు. 2019లో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పొట్టనపెట్టుకున్న పుల్వామా దాడిలో ఇతని పేరు తొలిసారిగా తెరపైకి వచ్చింది. కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం, నియామకాలు చేపట్టడం, పాకిస్థాన్ నుంచి నిధులు సమకూర్చడంలో బుర్హాన్ కీలక పాత్ర పోషించాడని భారత భద్రతా ఏజెన్సీలు చెబుతున్నాయి. 2022లో భారత్ ఇతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పీఓకేలోని ముజఫరాబాద్‌లో ఓ ప్రైవేట్ కాలేజీకి ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ వేరే గుర్తింపుతో దాక్కున్న ఇతడిని, గురువారం ఉదయం కాలేజీ గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత సమీపం నుంచి కాల్చి చంపారు. తలకు మూడు బుల్లెట్ గాయాలు కావడంతో ఆసుపత్రిలో మరణించినట్లు పాక్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఓ అనుమానితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com